


# ఎడబాటు

- శారద

"నాన్నా! టిఫిన్ రెడీయా?" గావుకేక పెట్టాడు రమేష్.

"అయిందిరా! నువు డ్రస్ చేసుకొచ్చేయి" హడావిడిగా అన్నాడు గోపాలరావు.

"ఏమిటి నాన్నా ఇవి? దోసెలా? అలుగుగ్గడ్డల్లా ఉన్నాయి. ఈ కిందిదయితే నల్లగా మాడి బొగ్గులాగుంది. ఈ దోసెలు నేనేం తింటాను కానీ, ఆ బ్రెడ్డు కొంచెం కాల్చి ఇవ్వు."

"ఒక్క పదినిమిషాలుండరా నాన్నా! మళ్ళీ రెండు దోసెలేసి ఇస్తాను."

"అమ్మో! నీతో పెట్టుకుంటే నాకు బస్సందినట్టే!" బ్రెడ్డు చేతిలో పట్టుకుని షూ లేసులు కట్టుకుంటున్నాడు రమేష్.

"రమేష్, కొంచె ఆ సైకిలు సంగతి" కొంచెం జంకుగా అని ఆగిపోయాడు గోపాలరావు.

"అబ్బా నాన్నా! ఇప్పుడా సైకిలుకి తొందరేం వచ్చింది? సాయంత్రం వచ్చినప్పుడు చూస్తాలే" బాగ్ తగిలించుకుని పరిగెత్తాడు రమేష్.

తలుపేసుకుని లోపలికొచ్చి కుర్చీలో కూర్చున్నాడు గోపాలరావు. ప్లేటులో వదిలేసిన దోసెలు చూడగానే తండ్రి హృదయం తరుక్కుపోయింది.

"పిచ్చి నాన్న! అసలే వాడికి బ్రెడ్డంటే పరమ అహ్యం. రేపణ్ణించీ ఎలాగైనా ఇంకొంచెం ముందుగా లేచి మంచి టిఫిన్ చేసి పెట్టాలి," అనుకున్నాడు బాధగా.

వంటింట్లోకి వెళ్ళి చూడగానే గుండె గుభిల్లుమంది. ఎక్కడి సామానులక్కడే పడి, చెత్తా చెదారంతో రణ రంగంలా గుంది. ఇదంతా శుభ్రం చేయడానికి కనీసం రెండు గంటలైనా పడుతుంది. "పార్వతీ, నువ్వే ఉండి ఉంటే ఇలా జరిగేదా," అనుకున్నాడు బాధగా. ముందు కొంచెం కాఫీ తాగి ఓపిక తెచ్చుకుని ఈ పనంతా తీర్చుకోవాలి, అనుకున్నాడు. కాఫీ తాగేసరికి సత్తువ వచ్చినట్టనిపించింది. అనుకున్నట్టుగానే వంటిల్లంతా సర్ది, అంట్లు తోమి తనకొరకు కొంచెం వంట చేసుకునే సరికి పదకొండవ్వనే అయింది. స్నానం, పూజా కానిచ్చుకుని రెండు మెతుకులు కొరికి అలసటతో పక్కమీదికి చేరాడు. అతనికి పార్వతిని తలచుకుంటే దిగులుగానూ, గిల్టీగానూ ఉంటోంది. ఇంటెడు చాకిరీ, ఒక్కతే ఎవరికీ ఏ లోపమూ రాకుండా ఎలా చేసుకునేదో, పాపం. తనేనాడూ ఒక

చేయందించిన పాపాన పోలేదు. అందుకే దేవుడీ విధంగా శిక్షిస్తున్నాడు. అంత చాకిరీలో కూడా మొహం మీద చిరునవ్వు చెదిరేది కాదు. "నన్ను ఒంటరిని చేసి, చెప్పాపెట్టకుండా ఎందుకెళ్ళావు పార్వతీ!?" లెక్కలేనన్నిసార్లు ఆ ప్రశ్న వేసుకుని ఉంటాడు.

సన్నగా నిద్రపడుతూ ఉండగా ఫోన్ మోగింది.

"నాన్నా, నా గదిలో టేబుల్ మీద ఒక కేలిక్యులేటరూ, ఒక ఎర్ర ఫోల్డరూ మర్చిపోయాను. కొంచెం తెచ్చిపెట్టు, ప్లీజ్!" రమేష్ సెల్ ఫోన్ నుంచీ మాట్లాడుతున్నాడు.

"అది కాదురా, నాన్నా, ఇంకా బట్టలుతకలేదు, ఎండ బాగా ఉంది" చెప్పబోయాడు గోపాలరావు.

"అబ్బా! నాన్నా! చిన్న పనికే ఇంత హైరానా అవుతావెందుకు? రానూ పోనూ ఆటో మాట్లాడుకో! నాకు టైమవుతుంది." ఫోన్ పెట్టేసాడు రమేష్. ఉసూరుమంటూ లేచాడు గోపాలరావు. కళ్ళు తిరుగుతున్నట్టనిపించింది. ఎలాగో సర్దుకుని లేచి రమేష్ గదిలోంచి కేలిక్యులేటరూ, ఫోల్డరూ తీసుకుని బయటికొచ్చాడు.

ఆటోలోనే అయినా వెళ్ళి ఇచ్చి మళ్ళీ వచ్చేసరికి రెండు దాటనే దాటింది. గబగబా బట్టలుతికి ఇల్లు శుభ్రం చేసి రాత్రి వంటలో పడ్డాడు. వంట పూర్తి చేసి కాసేపలా చల్లగాలికి తిరిగొద్దామని పార్కుకి బయలుదేరాడు. మామూలుగానే పార్కులో అందరూ కొడుకుల స్వార్థం, కోడళ్ళ నీచత్వం గురించి మాట్లాడుకున్నారు. వాళ్ళందరి మాటలకి మనసు బరువెక్కింది.

"ఏమిటో ఈ జీవితాలు! ఈ బాధంతా పంచుకుందామంటే పార్వతి..." ఆలోచనలని బలవంతంగా పార్వతి మీదనుంచీ మళ్ళించాడు.

రాత్రి తనూ కొడుకూ, మౌనంగా, మాట్లాడుకోవటానికేమీలేనట్టు భోజనం ముగించారు. ఇద్దరి మధ్యా ఏదో దూరం, ఇదీ అని చెప్పలేని కమ్యూనికేషన్ గేప్. టేబులూ, వంటిల్లూ శుభ్రం చేసి పక్క మీద వాలాడు గోపాలరావు.

ఇవాళ మరీ ఒంటరిగా అనిపిస్తుంది. రమేష్ అయినా కాసేపు పలకరించి మాట్లాడితే బాగుండు. తనగదిలో ఏదో పనిచేసుకుంటున్నట్టున్నాడు. తను వెళ్ళి పలకరిస్తే గయ్యిమని లేస్తాడు.

తల్లికీ, తనకీ లేని ఈ కోపం ఎక్కణ్ణించీ వచ్చిందో వాడికి. పార్వతి తండ్రి పోలికై ఉండాలి. ఆ కోపిష్టి మనిషిని ఒప్పించి పార్వతిని పెళ్ళాడేసరికి తనకి తాతలు దిగొచ్చినంత పనైంది. వీడు అచ్చంగా తాత నోట్లోంచి ఊడిపడ్డాడు. ఇప్పుడే ఇంత కసిరి కొడతాడు, రేపు కోడలు వచ్చాక ఇంకెంత మొరటుగా ప్రవర్తిస్తాడో! తనకీ ఇన్ని కాఫీ నీళ్ళైనా దక్కుతాయో, దక్కవో! పార్కులో స్నేహితులందరి మాటలూ గుర్తొచ్చి గాభరాగా లేచి కూర్చున్నాడు.

కొడుకూ కోడలూ తనని నిరాదరించినట్టూ, తనని చూసి విసుక్కున్నట్టూ కళ్ళ ముందు సినిమాలా కనిపించి చెమటలు పట్టినట్టైంది. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కొడుకు, భార్య రాగానే మారిపోతాడా! కాదు, తను వాళ్ళకా అవకాశమే ఇవ్వడు. కోడలు రాగానే ఏదైనా ఓల్డ్ ఏజ్ హోంలో చేరిపోతాడు.

నిజమే! ఇప్పుడే ఆ సైకిలు గురించి ఎన్నిసార్లడిగినా కసిరి కొడతాడేకానీ, పట్టించుకోడు. రేపు వీడేదో తనని ఉద్ధరిస్తాడనుకోవటం తన బుద్ధితక్కువతనం. స్నేహితులందరిలా వాళ్ళ చేతిలో అవమానాలూ, మనస్తాపాలూ పొందే కంటే ముందే తను సిద్ధంగా ఉండటం మంచిది.

లేచి కూర్చుని లైటు వేసుకుని, డైరీ, టెలిఫోన్ డైరెక్టరీ తెచ్చుకున్నాడు. డైరెక్టరీలోంచి తన డైరీలోకి కొన్ని వృద్ధాశ్రమాల అడ్రసులు రాసుకోవటం మొదలుపెట్టాడు. తలుపు దగ్గర అలికిడైంది. తలెత్తి చూస్తే రమేష్.

"ఏం రాసుకుంటున్నావు నాన్నా?" సౌమ్యంగా అడిగాడు.

"అబ్బే! ఏం లేదురా, అదీ, ఊరికే తోచక." మొహమాటంగా నవ్వి డైరీ మూసే ప్రయత్నం చేసాడు.

ఎన్నడూ లేనిది తండ్రి ఏం రాస్తున్నాడో చూద్దామని కుతూహలంగా డైరీలోకి తొంగి చూసాడు రమేష్.

"ఇదేమిటి? ఎందుకీ ఓల్డ్ఏజ్ హోం అడ్రసులన్నీ రాస్తున్నావు?" వింతగా అడిగాడు. ఒక్కసారి తడబడ్డాడు గోపాలరావు.

"మరీ, ఎప్పుడైనా భవిష్యత్తులో అవసరం వస్తే ఉంటాయని...." నీళ్ళు నమిలాడు.

"గ్యారంటీగా నీకు పిచ్చెక్కింది. లేకపోతే నీకు ఓల్డ్ఏజ్ హోంలతో పనేమిటి? అసలు నీకు..." తలుపు చప్పుడవడంతో మాట్లాడడం ఆపి తలుపు తెరవటాని వెళ్ళాడు.

ఊపిరి పీల్చుకున్నాడు గోపాలరావు. ఇంత రాత్రప్పుడు ఎవరూ? ఎవరైతే ఏం, రమేష్ తిట్లనుంచీ తప్పించారు. తనూ హాల్లోకి నడిచాడు.

"ఏమిటి, అప్పుడే నిద్రపోయారా? ఏరా రమేష్, రేపు నీకు లెక్కల పరీక్ష కదా? చదువుతున్నావా?"

చెప్పులన్నా విప్పకుండానే పార్వతి దండకం మొదలు పెట్టింది.

"పార్వతీ, నువ్వేనా! ఇన్ని రోజులూ ఎక్కడికెళ్ళావు? అసలు నువ్వు లేకుండా నేనెలా ఉంటాననుకున్నావు?" గోపాలరావు మొహంలో కన్నీళ్ళొక్కటే తక్కువ.

"మీకేమైనా మతి పోయిందా ఏమిటీ? మా అన్నయ్య రమ్మన్నాడని అర్జంటుగా వెళుతూ ఉత్తరం కూడా పెట్టానే! అయినా నాలుగురోజుల్లో ఇలా డీలా పడ్డారేమిటండీ? పైగా సెలవు కూడా పెట్టారు, ఇంతోటి ఇల్లు సవరించుకోవటం కోసం," మూతి మూడు వంకరలు తిప్పింది పార్వతి.

"అసలు నీ కొడుకు నన్నెన్ని చిత్రహింసలు పెట్టాడో తెలుసా?"

ఉక్రోషంగా అన్నాడు.

"చాల్లెండి, ఎవరైనా వింటే నవ్వుతారు. ఇంటర్మీడియట్ చదువుతున్న వెధవ మిమ్మల్ని హింస పెట్టడం ఏమిటి?"

"అమ్మో! వాడా! వంటకి సవాలక్ష వంకలు పెట్టాడు. అది మరచిపోయాననీ, ఇది తెమ్మనీ కాలేజీ చుట్టూ తిప్పాడు. మాట్లాడితే మీదపడి అరిచాడు. అది సరే గానీ, వాడికి మీ నాన్న పోలిక ఇంతగా వచ్చిందేమిటే! మా ఇంటా వంటా లేదు ఇంత కోపం."

"సరేలెండి! అనుకుంటూనే ఉన్నాను, ఇంట్లో కాలు పెట్టి పదినిముషాలు పైనే అయింది, ఇంకా మా వాళ్ళని ఆడిపోసుకోవటం మొదలు పెట్టలేదేమిటా అని."

"అదికాదమ్మా! నాన్న వంట ఇంత ఛండాలంగా ఉంటుందని ఇప్పుడే తెలిసింది. నాలుగు రోజులుగా తిండే సరిగ్గా లేదు. దానికి తోడు ఇప్పుడీయన గారు ఓల్డ్ఏజ్ హోం అడ్రసులు రాస్తున్నారు. అసలాయన వయసెంతమ్మా?"

"ఓల్డ్ ఏజ్ హోంలేమిట్రా?"

"ఏమో మరి! ఇదిగో ఈ డైరీ చూడు." డైరీ తెచ్చాడు రమేష్.

"ఏమిటండీ ఇదంతా?" అయోమయంగా అడిగింది.

"సాయంత్రం పార్కులో అందరూ వాళ్ళ కోడళ్ళూ కొడులూ ఎంత బాధ పెడుతున్నారో చెప్పి బాధపడ్డారు. మనల్నీ కోడలు వచ్చాక వీడు చూస్తాడో లేదోనని, ఇప్పణ్ణించే మనం సిద్ధంగా ఉందామనుకున్నాను."

"నా బొంద! పద్దెనిమిదేళ్ళైనా లేవు వాడికి, కోడలు రావటమేమిటండీ! మండినట్టే ఉంది మీ ముందు చూపు."

"నువ్వలాగే కలలు కంటూ ఉండు! సైకిలు సంగతేమైందో కనుక్కో ముందు చూద్దాం!"

"అప్పుడే చెప్పానుగా, ఆదివారం శ్రీధర్ దగ్గర్నించీ తీసుకొస్తానని. తీసుకురాగానే రిపేర్లేమైనా ఉంటే చేయించి సతీష్ కిచ్చేద్దాం." ఎంతో సౌమ్యంగా చెపుతున్న కొడుకుని చూసి ఆశ్చర్యపోయాడు గోపాలరావు.

అమ్మదొంగా! తనడిగితే కస్సుబుస్సుమని లేచి, తల్లి రాగానే పిల్లిలా మాట్లాడుతున్నాడు. చెల్లెలి కొడుకు సతీష్ కిద్దామని రెండు నెలలుగా బతిమలాడితే ఇవాళ్టికి తేలాడు. ఎంతైనా తల్లి తల్లే! ఆమె మాట వింటాడు. తన గతి అధోగతే! ఉక్రోషంగా కూర్చున్న గోపాల రావునిచూసి తల్లీ కొడుకులు నవ్వాపుకున్నారు.

"ఏమిటండీ చిన్నపిల్లాడిలా! పరీక్షల హడావిడిలో వాడు కొంచెం విసుక్కున్నాడేమో. పదండి పడుకుందాం. రేపు కూడా సెలవు పెట్టారా?"

"రేపు పొద్దున్నే ఆఫీసుకెళతాను. ఇంకెప్పుడూ వీడితో నన్నొక్కణ్ణీ వదిలేసి వెళ్ళకు పార్వతీ!"

"మరి మీరు నన్నొదిలి ఆఫీసు టూర్లకి వెళ్ళినప్పుడు నేనెలా సంపరించుకున్నానో", నవ్వు బిగపట్టి అడిగింది పార్వతి.

"నువ్వు నాకంటే తెలివైనదానివీ, చురుకైనదానివీ అని ఒప్పుకున్నాను, సరేనా! ఈసారి ఎక్కడికి వెళ్ళినా నన్నూ తీసికెళ్ళాలంతే!" తేల్చి చెప్పాడు గోపాలరావు.



శారద గారు సౌత్ ఆస్ట్రేలియా లోని అడిలాయిడ్ నివాసి. తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లోనూ రచనలు చేస్తుంటారు..